# ప్రభాత సమాచారం

Digital Edition

తెలంగాణ తెలుగు దినపత్రిక

జిల్లా అనుబంధం

■ గురువారం | 3 అక్టోబర్ 2024 | ■ 10 పేజీలు


## మహారాష్ట్ర టు హైదరాబాద్



- ■ 4 లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 100 పశువుల పట్టివేత
- ■ కిక్కిరిసిన లారీలో 21 పశువుల మృత్యువాత
- ■ పరారీలో ఇద్దరు డ్రైవర్లు.. పోలీసుల అదుపులో మరో ఇద్దరు
- ■ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట వద్ద పట్టివేత
- ■ పట్టుకున్న పశువులను గోశాలకు తరలించిన పోలీసులు
- ■ నిత్యం దాడులు జరుగుతున్నా ఆగని పశువుల దందా
- ■ జిల్లా సరిహద్దు ప్రాంతాల గుండా అర్ధరాత్రి పశువుల రవాణా

-వివరాలు2లో

# హైడ్రా అటెన్షన్





**మాకూ బుల్డోజర్ రావాలి.. కావాలి..!**



- ■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెరువుల కబ్జాలకు చెక్
- ■ హైడ్రా తరహా జిల్లా కేంద్రాల్లోనూ ఉక్కుపాదం మోపాలి
- ■ గత ప్రభుత్వ పాలనలో చెరువులు, భూముల కబ్జా ■ చెరువుల కబ్జాలో నిర్మల్ టాప్
- ■ మంచిర్యాల జిల్లాలోనూ చెరువులు కబ్జా చేసి లే అవుట్‌ల ఏర్పాటు చేసిన వైనం..
- ■ హైడ్రా ప్రకంపనలతో అందరి దృష్టి నిర్మల్‌పైనే ■ చెరువుల ఆక్రమణదారుల్లో టెన్షన్
- ■ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు ■ సహకరించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- ■ ఎఫ్టీఎల్ పరిధిలోని పలువురి నివాసాలకు నోటీసులు జారీ చేసిన అధికారులు

ఆపరేషన్ హైడ్రా..!.. ఇప్పుడు ప్రతి ఒక్కరి నోట్లో నానుతున్న మాట. హైదరాబాద్ జంట నగరాల్లో చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ పరిధిలో నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న అనేక భవనాల సముదాయాలను కూల్చివేస్తున్న పరిణామాలపై అంతటా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ చెరువుల హద్దుల గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటికే చెరువుల హద్దులను గుర్తించిన అధికారులు కొందరికి నోటీసులు కూడా జారీ చేసినట్లుగా సమాచారం. ముఖ్యంగా నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా కేంద్రాలతో పాటు పలు మున్సిపాలిటీలలో చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి ఆక్రమణదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. కోర్టు కేసులు నడుస్తున్న నేపథ్యంలో నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు ఆక్రమణకు గురైన స్థలాలు, వాటి పూర్తి వివరాలను కోర్టులకు సమర్పించారు.

*- ప్రభాత సమాచారం ప్రత్యేక ప్రతినిధి, ఆదిలాబాద్*

3

## పూల సంబురం

## పుడమి శోభితం

- ■ ఒక్కేసి పువ్వేసి.. చందమామ..
- ■ ఎంగిలిపువ్వుతో 'బతుకమ్మ'కు శ్రీకారం
- ■ పూదోటలుగా పల్లెలు, పట్టణాలు..
- ■ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సంస్కృతిని చాటిన మహిళలు

మహిళలు ఆనందోత్సాహాలతో, ఆచార సంప్రదాయాలతో వేడుకగా జరుపునే పూలపండుగ 'బతుకమ్మ' తెలంగాణ జీవనానికి నిలువెత్తు సాక్ష్యం.. చరిత్రలో విభిన్నమైన పూలను కొలిచే ఆచారం బతుకమ్మ పండుగలోనే ఉండటం విశేషం.. ప్రకృతిలో సేకరించిన పూలను తిరిగి ప్రకృతికే సమర్పించడం బతుకమ్మ వైశిష్టానికి నిదర్శనం.. అశ్వయుజ శుద్ధ అమావాస్య బుధవారం రోజు నుంచి మహర్నవమి వరకు తొమ్మిది రోజులు జరుపుకునే పూల పర్వానికి మహిళలు శ్రీకారం చుట్టారు. ప్రకృతి సైతం తన అందచందాలతో బతుకమ్మ పండుగకు కావాల్సిన పూలతో శోభాయమానంగా మారింది. వివరాలు6లో



బొడ్డెమ్మ.. బొడ్డెమ్మ.. వలలో



## గాంధీజీ ఆశయాలు సాధిద్దాం

గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గాంధీ జయంతి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు జాతిపితకు నివాళులర్పించారు. మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

10




### ఏకలవ్య మోడల్ పాఠశాలను

## వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

- ● ఏకలవ్య మోడల్ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన
- ● ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేశ్
- ● విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలి
- ● ఖానాపూర్ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ సూచన

## బాసరకు.. నవకళ



- ■ మహిమాన్విత బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రం..
- ■ నేటి నుంచి శారదీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ■ అక్టోబర్ 12వరకు ఉత్సవాలు
- ■ తొలి రోజు శైలపుత్రి అవతారంలో అమ్మవారి దర్శనం
- ■ ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు - 7లో

జిల్లాలో గురువారం నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రం నవరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. తొమ్మిది రోజుల పాటు రోజుకో రూపంలో అమ్మవారిని అలంకరించి నియమనిష్టలతో పూజలు చేయనున్నారు.. దుర్గామాతను పూజించేందుకు ఆలయాలు, మంటపాల నిర్మాణం పూర్తి చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
PRABHATHA SAMACHARAM
TELANGANA TELUGU DAILY

# బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా అభియాన్

**కాగజ్‌నగర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)** కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ పార్కులో ఈరోజు గాంధీ జయంతి సందర్భంగా సేవా మహాయజ్ఞాన్ని నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా మున్సిపల్ కార్మికులతో కలిసి పార్కును శుభ్రపరచడం జరిగింది. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అంటువ్యాధుల బారి నుండి కాపాడు కోగలుగుతామని తెలియజేశారు. భాజపా జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా సూచన మేరకు భారతీ యజనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు డా.కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీని వాస్, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు వలుపదాసు శ్రీదేవి, ఈర్ల విశ్వేశ్వర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ తిరుపతి, అశోక్ ఆర్య, ధోతుల శ్రీనివాస్, బూరం రాజు, అశోక్, రమేష్, సంతోష్ ఠాకూర్, రాణి, అర్జున్, అనిల్, సౌరబ్ ధాత్రక్ తదితరులు పాల్గొన్నారు.



## ఇద్దరికి ఎంబీబీఎస్ సీటు..



**జన్నారం, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)** మండలంలోని పొనకల్‌కు చెందిన దుమల్ల నాగమణి ఎంబీబీఎస్ సీటు సాధించింది. నీట్‌లో రాష్ట్రస్థాయిలో 5864 ర్యాంకు పొంది నిర్మల్ మెడికల్ కాలేజీలో ఆమెకు సీటు వచ్చింది. అలాగే మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన బాణావ వినీత్ కుమార్ 3666 ర్యాంకు సాధించి రామగుండంలోని సింగరేణి మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు వచ్చింది. నాగమణి పొనకల్ వాసి దుమల్ల ఎల్లయ్య, సరిత దంపతుల పెద్ద కుమార్తైనా ఆమె చిన్నప్పటి నుంచిఎంతో చురుగ్గా చదువుకుంటూ మంచి మార్కులు సాధించేది. ఆమె ఒకటి నుంచి 4వ తరగతి వరకుగ్రామంలోని పొనకల్ ప్రాథమిక పాఠశాలలో చదివి, ఆ తర్వాత నిర్మల్ కేంద్రంలోని టీఎస్‌ఆర్జెసీ(డబ్ల్యూ)లో 5వతరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ లక్షెట్టిపేటలోని టీఎస్ ఆర్జెసీ(డబ్ల్యూ) చదువుకుంటూ నిట్ లో ర్యాంకు పొందింది. ఈ మేరుకు కౌన్సిలింగ్ ద్వారా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించగా, ఆమెకు నిర్మల్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఈ మండలంలోని చింతగూడకు చెందిన బానావత్ వినీత్ కుమార్ ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నీట్‌లో రాష్ట్రస్థాయిలో 3666 ర్యాంకు పొంది పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సింగరేణి మెడికల్ కాలేజీలో తనకు సీటు వచ్చింది. చింతగూడగు చెందిన బానావత్ తిరుపతి, సుమలత దంపతుల పెద్ద కుమారుడైన వినీత్ చిన్నప్పటి నుంచి ఎంతో చురుగ్గా చదువుకుంటూ మంచి మార్కులు సాధించాడు. అతను ఒకటి నుంచి 5వ తరగతి వరకు మండలంలోని జయారాణి హైస్కూల్‌లో చదివి, ఆ తర్వాత కాగజ్‌నగర్‌లోని నవోదయలో 6 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కాలేజీలో చదివి నీట్ రాసి ర్యాంకు పొందాడు. ఈ మేరుకు కౌన్సిలింగ్ ద్వారా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించగా, అతనికి పెద్దపల్లి జిల్లాలో కాలేజీలో సీటు కేటాయించారు. సందర్భంగా వారిని మండల అంబేత్కర్ యువజన సంఘం అధ్యక్షులు భరత్ కుమార్ కాసెట్టి లక్ష్మణ్ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ముత్యం సతీష్, మేకల మాణిక్యం, ఈ రుణాల గంగన్న, రమేష్, సత్యనారాయణ రాజన్న తదితరులు వారిని పూలమాలలతో శాలువాతో సన్మానించారు.

## పట్టభద్రుల ఎన్నికల మండల ఇంచార్జిగా కదం సంతోష్

**ముథోల్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)** ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ముథోల్ మండల ఇంచార్జిగా నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌కు చెందిన కదం సంతోష్ పటేల్ నునియమిస్తూ జిల్లా ఎన్నికల ఇంచార్జ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శ పైడిపల్లి గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో నాపై నమ్మకం ఉంచి ఈ అవకాశం ఇచ్చినందుకు, బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని సంతోష్ తెలిపారు. అదే విధంగా తనను ఇంచార్జిగా నియమించినందుకు ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, జిల్లా బీజేపీ అధ్యక్షులు అంజు కుమార్ రెడ్డి, బీజేపీ ముథోల్ అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కదం సంతోష్ పటేల్‌ను మండల బీజేపీ అధ్యక్షుడు కోరిపోతన్న, మండల నాయకులు పోతన్న, పలువురు నాయకులు అభినందించారు.



# పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్ పత్రాలు అందజేత

**జన్నారం, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)** మండలంలోని పోన్కల్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి, కార్మికులకు జన్నారం ఎంపీడీవో శశికళ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి, కార్మికులకు చేయించిన ఇన్సూరెన్స్ పత్రాలను అందించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు.కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



# డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)** బుధవారం కలెక్టరేట సమావేశ మందిరంలో డిజిటల్ కార్డుల సర్వేపై సంబంధిత అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రేపటినుండి చేపట్టనున్న డిజిటల్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరికి డిజిటల్ నెంబర్ ను కేటాయించడంతో పాటు, కుటుంబానికి కలిపి ఒక నంబర్ ను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇంటిలోని పెద్ద వయస్కులైన మహిళను యజమానిగా గుర్తించాలన్నారు. రేపటి నుంచి డిజిటల్ సర్వేను మొదలుపెట్టి ఐదు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం, ఒక వార్డు ను పైలెట్ ప్రాజెక్టుగా సర్వే చేపట్టాలని సూచించారు. రోజువారీగా నిర్వహించిన డిజిటల్ సర్వేకు సంబంధించిన నివేదికలను తమకు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సర్వేకు సంబంధించి నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలకు ఆర్డీవో లు, ఖానాపూర్ నియోజకవర్గానికి జెడ్పి సిఈఓ నోడల్ అధికా రులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, డిఆర్ఓ భుజంగ్ రావు, డిపిఓ శ్రీనివాస్, ఈడిఎం నదీం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న నేతలు



**ముథోల్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)** ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ మంత్రి వేణుగోపాల చారి, ఆదిలాబాద్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జనార్దన్ రాథోడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల రామనాథ్, జై సేవాలాల్ లంబాడి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ కృష్ణ నాయక్‌తో కలిసి విజయవాడ కనకదుర్గ అమ్మ వారిని మాజీ ఏఎంసీ చైర్మన్ జాదవ్ రాజేష్ బాబు దర్శించుకున్నారు. వారితో పాటు భైంసా మాజీ జెడ్పిటిసి సోలంకి భీంరావు పటేల్, బాసర్ మాజీ జెడ్పిటిసి వసంత రమేష్ , భైంసా మాజీ ఎంపీపీ రజాక్, మాజీ జెడ్పిటిసి పండిత్రావు, తానూర్ బిజెపి మండల అధ్యక్షుడు చిన్న రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ రవీందర్ రావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ చిన్న రావు, సతీష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, భైంసా మండల అధ్యక్షుడు గుంటూరు శంకర్, మాజీ సర్పంచ్ విట్టల రావు, సాయినాథ్, కోరి పోతన్న, ధర్మపురి శ్రీనివాస్, సప్పటోళ్ల పోతున్న, అనిల్, కిష్టయ్య బాలు, వెంకట్రావు పటేల్, హతిరాం బాబాజీ ఆలయ కమిటీ అధ్యక్షులు శీను నాయక్, జాదవ్ తుకారాం, జాదవ్ విజయ్ కుమార్, రాథోడ్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లారీల్లో తరలిస్తున్న

# వంద పశువుల పట్టివేత



**కాగజ్‌నగర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)** పశువుల అక్రమ రవాణా నిత్యకృత్యమైంది. మహారాష్ట్ర టూ తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం పెంచికలపేట మండలం వద్ద ఎస్సై కొమురయ్య అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నారు. బుధవారం తెల్లవారుజామున నాలుగు లారీలలో మహారాష్ట్ర మీదుగా తెలంగాణ సరిహద్దు ప్రాంతం నుండి పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. నాలుగు లారీలకు సంబంధించిన డ్రైవర్లలో ఇద్దరు పరారీ అయినట్లు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు. పశువులను కాగజ్ నగర్ మండలం కోసిని గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఎడ్లు, ఆవులు 100కు పైగా ఉన్నట్లు తెలిపారు. వీటిని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ తరలిస్తున్నట్లు తెలిపారు. పరారైన లారీ డ్రైవర్లను పట్టుకొని పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

## మద్యం తాగడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

**లోకేశ్వరం, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)** మద్యం సేవించడానికి బానిసైన వృద్ధుడు మద్యం కొనుగోలు చేసేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన లోకేశ్వరం మండలంలో జరిగింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం గడ్ చందా గ్రామానికి చెందిన ఒలపు ముత్యం (60) తాగుడుకు బానిసై నిత్యం డబ్బుల కోసం భార్యను వేధించేవాడని తెలిపారు.

మంగళవారం ఉదయం డబ్బుల విషయంలో భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడని బుధవారం ఉదయం గడ్ చందా సమీపంలోని గోవింద్ చెరువులో మృతుని శవాన్ని గుర్తించినట్లు తెలిపారు. సంవత్సరం క్రితం ఇలాగే మద్యం కొనుగోలుకు డబ్బులు ఇవ్వాలంటూ భార్యని వేధించగా ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని అన్నారు. మృతుని భార్య నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక



జిల్లా అనుబంధం
PRABHATHA SAMACHARAM
TELANGANA TELUGU DAILY



# హైడ్రా.. అటెన్షన్

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెరువుల కబ్జా..
- హైడ్రా తరహా జిల్లాలోనూ ఉక్కుపాదం మోపాలి
- గత ప్రభుత్వ పాలనలో చెరువుల, భూముల కబ్జా
- నిర్మల్, మంచిర్యాల జిల్లాలో చెరువులు మాయం
- కబ్జా చేసిన చెరువుల్లో లే అవుట్‌ల ఏర్పాటు
- భూ కబ్జాలపై రాజకీయ ఘర్షణలు..
- హైడ్రా ప్రకంపనలతో అందరి దృష్టి నిర్మల్‌పైనే
- చెరువులు, కుంటల ఆక్రమణదారుల్లో టెన్షన్
- ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు
- సహకరించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో మొదలైన చర్చ
- స్థానికుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్ కూల్చివేతలపై సర్వత్రా ఆసక్తి

**(ప్రభాత సమాచారం ప్రత్యేక ప్రతినిధి, ఆదిలాబాద్)**

ఆపరే షన్ హైడ్రా..!.. ఇప్పుడు ప్రతి ఒక్కరి నోట్లో నానుతున్న మాట. హైదరాబాద్ జంట నగరాల్లో చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ పరిధిలో నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న అనేక భవనాల సముదాయాలను కూల్చివేస్తున్న పరిణామాలపై అంతటా ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వాలకు భిన్నంగా రేవంత్ సర్కారు అధికార రాజకీయ ఒత్తిళ్ల ను పక్కనపెట్టి హైడ్రా యంత్రాంగానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి న నేపథ్యంలో భారీ మొత్తంలో నిర్మించిన అపార్ట్మెం ట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, ఇతర బహుళ అంతస్తుల భవనాలను కూల్చివేస్తున్న ఘటనలు విస్తుగొలుపుతున్నా యి. అక్రమాలను ఇలా కూడా తొలగించవచ్చా..! అని గతంలో విన్నామే కానీ చూడలేదన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి యంత్రాంగమే మన వద్దకు వస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని సైతం వ్యక్త పరుస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో భారీగా చెరువుల కబ్జాలు..**

గత ప్రభుత్వాల పాలనలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక చెరువులు పెద్ద మొత్తంలో కబ్జాలకు గురయ్యాయి. ముఖ్యంగా మున్సిపల్ కేంద్రాలుగా ఉన్న పలు పట్టణాల్లో చెరువుల కబ్జాలు భారీగా జరిగాయి. ఉమ్మడి జిల్లాకు కేంద్రంగా ఉన్న ఆదిలాబాద్ సహా కొత్త జిల్లాలుగా ఏర్పడిన నిర్మల్ మంచిర్యాల జిల్లా కేంద్రాల్లో ఉన్న అనేక చెరువులు కబ్జాలకు గురై కుచించుకుపోయాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న రాముని చెరువు భారీగా కబ్జాకు గురైంది. మరోవైపు పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీ ఏర్పడడానికి ముందు ఆ ప్రాంతంలో పెద్ద చెరువు ఉండేది ఇప్పుడు ఆ చెరువు ఆనవాళ్లు లేకుండా పోయాయి. దీన్నిబట్టి చెరువుల



కబ్జాలు మంచిర్యాల పట్టణంలో ఏ స్థాయిలో జరిగాయో అర్థం అవుతుంది. అలాగే జన్నారం మండల కేంద్రంలోని ఓ చెరువు భారీగా ఆక్రమణలకు గురైంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో ఉన్న ఖానాపూర్ చెరువు వద్ద ట్యాంక్ బండ్ నిర్మాణం పేరుతో అప్పటి అధికార పార్టీ నాయకులు కబ్జాలు పెట్టారు మరోవైపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మావల పరిధిలో ఉన్న భారీ తటాకం లోకి 200 ఫీట్ల మేర చొచ్చుకు వెళ్లి కబ్జా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఈ చెరువు ఎఫ్ టి ఎల్ లో అనేక నిర్మాణాలు కూడా జరిగాయి దీనిపై అనేక ఫిర్యాదులు వెళ్లినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఓ నేత అండదండలతో కబ్జాకోరులు భారీగా ఆక్రమణలు చేశారని ఈ ఆక్రమణల్లో సదరు నేతకు వాటా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

**నిర్మల్ జిల్లాలో మరీ ఎక్కువ..**

ఆపరేషన్ హైడ్రా చేస్తున్న అక్రమ కట్టడాల కూల్చివేత నేపథ్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో చెరువుల కబ్జాలు మరోసారి తెరపైకి వస్తున్నాయి. అలాంటి కార్యక్రమాన్ని చేపడితే నిర్మల్ జిల్లా కేంద్రంలో నిమ్మ నాయుడు కాలంనాటి గొలుసుకట్టు చెరువులకు పునరుజ్జీవం వస్తుందన్న అభిప్రాయాలు వ్యర్థం అవుతున్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలో పట్టణ నడిబొడ్డుతో పాటు పట్టణం చుట్టూ సుమారు 13 పెద్ద చెరువులు ఉన్నాయి ఈ చెరువులకు ఒకదానితో ఒక చెరువుకు లింక్ ఇస్తూ కాలువలు ఉండేవి. పట్టణం భారీగా విస్తరించిన నేపథ్యంలో అనేకమంది కబ్జాదారులు చెరువుల లింకు కాలువలను మూసివేసి ఆక్రమణలకు పాల్పడ్డారు. వీటిపై అనేక బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణం జరిగాయి.

ఆక్రమణలు, కబ్జాలతో ఈ చెరువు భూముల విస్తీర్ణం 50 శాతం పైగా కనుమరుగైందన్న అభిప్రాయాలు ఉన్నాయి. నీటిపారుదల శాఖ రెవెన్యూ రికార్డుల ప్రకారం బంగల్ పేట చెరువు 210.32 ఎకరాలు, ఖజానా చెరువు 98.22 ఎకరాలు, కొత్తచెరువు 33.11 ఎకరాలు, రామ్ సాగర్ చెరువు 37.23 ఎకరాలు, కురన్నపేట చెరువు 76.18 ఎకరాలు, సీతా సాగర్ గొల్లపేట చెరువు 48.11 ఎకరాలు, ఇబ్రహీం చెరువు 76.18 ఎకరాలు, కంచరోని చెరువు 74.19 ఎకరాలు, ధర్మసాగర్ చెరువు 65.10 ఎకరాలు, మోతి తలాబ్ చెరువు 132.06 ఎకరాలు, చిన్న చెరువు మంజులాపూర్ 81.34 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు అధికారుల వద్ద ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కానీ కబ్జాల కారణంగా ఈ చెరువులు ఇప్పుడు సగం విస్తీర్ణం కూడా లేకుండా పోయాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో బహుళ అంతస్తుల భవనాలు పాఠశాలల సముదాయాలు వాణిజ్య భవనాలు నిర్మాణం జరిగిపోయాయి ఇలాంటి అక్ర మ నిర్మాణాలు తొలగించడం అంత సులువైన పని కాదు హైడ్రా లాంటి కఠినమైన నిబంధనలతో అధికారయంత్రాంగానికి చేతికి పని చెబితే మాత్రమే ఆక్రమణలు తొలిగే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**హైడ్రా లాంటి బుల్డోజర్ రావాలి...**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణలను తొలగించాలంటే హైదరాబాద్ లో జరుగుతున్న ఆపరేషన్ హైడ్రా లాంటి బుల్డోజర్ తమ జిల్లాకు తీసుకురావాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్ మంచిర్యాల ఆదిలాబాద్ పట్టణాలతో పాటు కొన్ని మండల కేంద్రాల్లోనూ భారీగా చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. భవిష్యత్ తరాలకు బహుళ ప్రయోజనాలు అందించే చెరువుల పరిరక్షణ జరగాలంటే ఇలాంటి కఠిన చట్టాలతో కూడిన సంస్థలకు అధికారం ఇవ్వాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్ నగరంలోని ఎఫ్టీఎల్ పరిధిలోని ఆక్రమణలను 'హైడ్రా' కూల్చివేస్తోంది. ఈ క్రమంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ చెరువుల హద్దుల గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటికే చెరువుల హద్దులను గుర్తించిన అధికారులు కొందరికి నోటీసులు కూడా జారీ చేసినట్లుగా సమాచారం. ముఖ్యంగా నిర్మల్ ఆదిలాబాద్ మంచిర్యాల జిల్లా కేంద్రాలతో పాటు పలు మున్సిపాలిటీలలో చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి ఆక్రమణదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. కోర్టు కేసులు నడుస్తున్న నేపథ్యంలో నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు సంబంధిత చెరువుల వాస్తవ విస్తీర్ణం, ఆక్రమణకు గురైన స్థలాలు, వాటి పూర్తి వివరాలను కోర్టులకు సమర్పించారు.

**ఉమ్మడి జిల్లాలో చెరువుల కబ్జాలు ఇలా..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక చెరువులు పెద్ద మొత్తంలో కబ్జాలకు గురయ్యాయి. ముఖ్యంగా మున్సిపల్ కేంద్రాలుగా ఉన్న పలు పట్టణాల్లో చెరువుల కబ్జాలు భారీగా జరిగాయి. ఉమ్మడి జిల్లాకు కేంద్రంగా ఉన్న ఆదిలాబాద్ సహా కొత్త జిల్లాలుగా ఏర్పడిన నిర్మల్, మంచిర్యాల జిల్లా కేంద్రాల్లో ఉన్న అనేక చెరువులు, నాళాలు కబ్జాలకు గురై కుచించుకుపోయాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న రాముని చెరువు, పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీ ఏర్పడడానికి ముందు ఆ ప్రాంతంలో ఉన్న పెద్ద చెరువు కబ్జాకు గురయ్యాయి. ఇప్పుడు ఆ చెరువు ఆనవాళ్లే లేకుండా పోయాయి. అదేవిధంగా జన్నారం మండల కేంద్రంలోని ఓ చెరువు భారీగా ఆక్రమణలకు గురైంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో ఉన్న ఖానాపూర్ చెరువు వద్ద ట్యాంక్‌బండ్ నిర్మాణం పేరుతో అప్పటి అధికార పార్టీ నాయకులు కబ్జాలు పెట్టారు. మరోవైపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మావల పరిధిలో ఉన్న భారీ తటాకంలోకి 200 ఫీట్ల మేర లోపలికి కబ్జా చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మరోవైపు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అనేక నిర్మాణాలు జరిగాయి. ఓ ఫంక్షన్ హాల్ సైతం చెరువు పరిధిలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానిపై అనేక ఫిర్యాదులు వెళ్లినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఓ నేత అండదండలతో కబ్జాకోరులు భారీగా ఆక్రమణలు చేశారని, అందులోనూ సదరు నేతకు వాటా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖానాపూర్ చెరువు హద్దులు గుర్తించి ఆక్రమణదారుల అంశాన్ని తేల్చారు. వారికి నోటీసులు ఇచ్చేందుకు కూడా రంగం సిద్ధం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిమ్మనాయుడు కాలం నాటి గొలుసు కట్టు చెరువులు కూడా కబ్జాకు గురయ్యాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలో పట్టణ నడిబొడ్డుతో పాటు పట్టణం చుట్టూ సుమారు 13 పెద్ద చెరువులు ఉన్నాయి. కబ్జాల కారణంగా ఆ చెరువులు ఇప్పుడు సగం విస్తీర్ణం కూడా లేకుండా పోయాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో బహుళ అంతస్తుల భవనాలు, పాఠశాలల సముదాయాలు, వాణిజ్య భవనాలు నిర్మాణం కూడా జరిగిపోయాయి. అయితే, ఆయా చెరువుల హద్దులను గుర్తించిన అధికారులు కోర్టు కేసుల నేపథ్యంలో రికార్డులను హైకోర్టుకు అందజేశారు.

**గొడవకు దిగుతున్న జనం..**

చెరువుల ఆక్రమణలకు సంబంధించి హద్దుల మార్కింగ్ కోసం వెళ్తున్న అధికారులతో ఆక్రమణదారులు, బాధితులు గొడవకు దిగుతున్నారు. ఇటీవలే ఆదిలాబాద్ పట్టణంలో ఖానాపూర్ చెరువు హద్దులను గుర్తించేందుకు వెళ్లిన అధికారులపై బాధిత కుటుంబాలు ఎదురు తిరిగాయి. ఎవరో ఆక్రమించి తమకు ప్లాట్లు చేసి అమ్మితే.. తాము ఇళ్లు కట్టుకున్నామని ఇప్పుడు 'హైడ్రా' పేరుతో మార్కింగ్ చేసి కూలిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. నోటీసులు తీసుకున్న వారు కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకుంటున్నారన్న చర్చ కూడా వినిపిస్తోంది. ఇది రాజకీయ పార్టీల నడుమ గొడవకు కూడా దారితీస్తుంది. ప్రతిపక్ష పార్టీలకు ఓ ఆయుధంగా మారుతోందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ఈ అంశాన్ని పొలిటికల్ కార్నర్‌గా మార్చుకుంది. ఇదే పరిస్థితి మిగతా జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీల్లో కూడా కొనసాగే అవకాశం ఉంది.



## అక్రమ నిర్మాణాలని గతంలో తెలియదా?

### ఖానాపూర్‌లో పర్యటించిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**

గతంలో కాంగ్రెస్ ఇందిరామ్మ ఇండ్లు మంజూరు చేసిన సమయంలో ఖానాపూర్ చెరువు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలని కాంగ్రెస్ నాయకులకు తెలియదా అని ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రశ్నించారు. బుధవారం ఖానాపూర్ చెరువు ప్రాంతంలో అధికారులు సర్వేలు నిర్వహిస్తున్న ఏరియాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. బైక్‌పై కాలనీలో తిరుగుతూ ప్రజలను కలిసి వారికి భరోసా ఇచ్చారు. ఇండ్లు కూలగొట్టకుండా తము ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా సీఎం రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు చేసిన గంగన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు భయ భ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఖానాపూర్ చెరువు



పరిసరాల్లో నివాసం ఉంటున్న వారికి అక్రమ కట్టడాలని అధికారులు సర్వే చేస్తుండడంతో వారికి రాత్రిళ్లు నిద్ర ఉండడం లేదన్నారు. గడిచిన తొమ్మిది నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ఇండ్లను కూల్చివేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. ఏ పని చేయాలన్న స్పష్టత ఇచ్చిన తరువాతనే ముందుకు సాగాలన్నారు. పేదలకు కష్టం కలిగించేల వ్యవహరిస్తే చూస్తు ఉరుకొబోమని స్పష్టం చేశారు. బాధితులకు ముందు ప్రత్యామ్నం చూపకుండా సర్వే పేరిట ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలామున్న, ప్రవీణ్, భీంసెన్ రెడ్డి, కృష్ణ, రాజేష్, సతీష్, విజయ్ ఉన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
PRABHATHA SAMACHARAM
TELANGANA TELUGU DAILY




# డిజిటల్ కార్డుల సర్వేను సమర్థవంతంగా చేపట్టాలి

- క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలి - గ్రామాల్లో, వార్డుల వారిగా టామ్ టామ్ వేయించాలి - హెల్ప్ డెస్క్ టోల్ ఫ్రీ నెంబర్ 9441019479, 8019337150
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత సిబ్బందికి శిక్షణ - ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని, దీనికి సంబంధించి తహసీల్దార్, మున్సిపల్ అధికారులను టీం అధికారులుగా వీరితో పాటు ఇద్దరు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతీ కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు ఇవ్వాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం లో ఒక అర్బన్ వార్డు, గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్ గా సర్వే బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఏర్పాటు చేసిన బృందాలకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ బృందాలు క్షేత్ర స్థాయిలో సర్వేను రేపటి నుండి ప్రారంభించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు డిజిటల్ కార్డుకు సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కింద వార్డు, గ్రామ పంచాయతీలలో పూర్తి స్థాయిలో కుటుంబ డిజిటల్ కార్డుకు సంబంధించిన పరిశీలన మొత్తం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లా వ్యాప్తంగా ఈ అంశాన్ని అదనపు కలెక్టర్, ఆర్‌డిఓలు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. ప్రజలు అందుబాటులో ఉండే సమయంలో సర్వేకు వెళ్లె విధంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. కుటుంబ సర్వే అంగన్వాడి టీచర్లకు తెలిసి ఉంటుందని, వారి సహకారం తీసుకోవాలని, కుటుంబ ఫొటో మొబైల్ ఫోన్‌లో తీసుకోవాలని, ఫార్మాట్‌లో ఇచ్చిన ప్రకారం డేటాలో పూర్తి వివరాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. డిజిటల్ కార్డుల జారీ కై ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రెండు గ్రామాలలో ప్రయోగాత్మక సర్వే నిర్వహించాలన్నారు. అర్బన్ నియోజకవర్గాలైతే రెండు వార్డులు/డివిజన్లను ఎంపిక చేయాలని సూచించారు. ఇంటింటి పరిశీలన చేపట్టి, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించాలని, ఈ నెల 8వ తేదీ నాటికి సర్వేను పూర్తి చేయాలని అన్నారు. 9 న స్క్రూటినీ జరిపి, 10 వ తేదీన సర్వేకు సంబంధించిన అన్ని అంశాలతో సమగ్ర నివేదిక పంపించాలని ఏ ఒక్క కుటుంబం సైతం తప్పిపోకుండా సర్వేను పకడ్బందీగా ఆర్డీఓ/జోనల్ కమిషనర్ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందనీ క్షేత్రస్థాయిలో సర్వే తీరును నిశితంగా పరిశీలన చేయాలని, ప్రతి రోజు ఒక్కో బృందం 30 నుండి 40 కుటుంబాలకు సంబంధించిన సర్వేను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకుని, గడువు లోపు పైలెట్ సర్వేను పూర్తి చేయించాలని అన్నారు. ఆయా ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా లబ్ది పొందేందుకు సామాన్య ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ డిజిటల్ కార్డులను జారీ చేయనున్నందున ఇంటింటి పరిశీలనను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పైలెట్ సర్వే పూర్తయిన మీదట రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

భూముల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం క్రింద దరఖాస్తు చేసుకున్న పెండింగ్ లో ఉన్న 1600 దరఖాస్తులను ప్రతీ రోజూ 20 దరఖాస్తులు క్లియర్ చేయాలని, ఈ నెల 9 వ తేదీ లోగా క్లియరెన్స్ చేయాలని, అక్టోబర్ 9 నుంచి నుండీ 31వరకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు. సలహాలు, సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్‌కు, హెల్ప్ డెస్క్ టోల్ ఫ్రీ నెంబర్ 9441019479, 8019337150 కాల్ చేయాలని, కలెక్టరేట్ ఏవో రామిరెడ్డి ని సంప్రదించాలన్నారు. అంతకు ముందు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి సంబంధిత సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఆర్డీవో వినోద్ కుమార్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేద్దాం
# చేనేత వస్త్రాలను ప్రోత్సహిద్దాం
### జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్



**కాగజ్‌నగర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
మండలంలోని చేనేత వస్త్ర సహకార సంఘన్ని సందర్శించి భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసిన సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా గాంధీ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాదీ వస్త్రాలని కొనుగోలు చేద్దాం చేనేత వస్త్రాలను ప్రోత్సహిద్దామని చేనేత నేత సంక్షేమ పథకం. చేనేత రిజర్వేషన్ చట్టం. జోధ్‌పూర్ డిప్లొమా కోర్సు, జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం ఈ పథకాన్ని భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ అమలు చేసింది. ఈ పథకం కింద చేనేత కోసం 11 రకాల వస్త్రాలు రిజర్వు చేయబడ్డాయి. చేనేత వస్త్రాల కోసం రిజర్వు చేయబడిన చీర, ధోతీ, తువ్వాళ్లు, గంచా, అంగవస్త్ర, లుంగీ, ఖేస్, బెడ్‌షీట్, బెడ్‌కవర్, కౌంటర్‌పేన్, ఫర్నిషింగ్ (టేప్‌స్ట్రీ, అప్హోల్స్టరీతో సహా), జమక్కలం, దర్రీ లేదా డ్యూరెట్, మెటీరియల్,విబ్యారక్ దుప్పట్లు మరియు కంబాల్ లేదా కాంబ్లీలు శాలువ, లోయి, మఫ్లర్, పంఖీ మొదలైనవి. ఉన్ని ట్వీడ్, చద్దర్, మేఖలా లేదా ఫనెక్. ఈ పథకం కింద, వాటిని. అధికారులు, ఉద్యోగుల జీతాలు, అలవెన్సులు ఇతర ఆకస్మిక ఖర్చులు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముత్తు అశోక్ జిల్లా కోశాధికారి అరుణ్ లోయ తాలూకా కన్వీన వీరభద్ర చారి పట్టణ అధ్యక్షులు సింగం శ్రీనివాస్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పారేపల్లి రాణి జిల్లా ఒబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్ రాజేందర్ చంద్రుడు కొండ తిరుపతి నికోడే అర్జున్ బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు

**బోథ్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
భీంపూర్ మండలం కరంజి (టి), గోముత్రి, అంతర్గాం తదితర గ్రామాల్లో బుధవారం సమీప వాగులు, చిట్టడవుల నుంచి చెన్నంగి చెట్టును సంప్రదాయబద్ధంగా తీసుకువచ్చారు. ఆచారం ప్రకారం తవ్విన బతుకమ్మ బావిలలో చెన్నంగి చెట్టు ప్రతిష్టించి దీపారాధన చేసి బతుకమ్మ వేడుకలు ప్రారంభించారు. బతుకమ్మ బావిలలో సూర్య, చంద్రగద్దెలు వచ్చిన మహిళలను తోటి మహిళలు అభినందించారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడారు.



## త్రిపుల్ ఐటీలో బతుకమ్మ సంబరాలు

**బాసర, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
బాసర త్రిపుల్ ఐటీలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి ఉమెన్ సెల్ కన్వీనర్ సృజనలతో కలిసి బతుకమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలో విద్యతోపాటు సాంస్కృతిక కళారంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని బతుకమ్మ బతుకు నిచ్చే అమ్మ అని, బతుకులను బాగుపరిచే తల్లి అని, పూలను పూజించే గొప్ప సంస్కృతి కలిగినటువంటి రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. వేలది మంది విద్యార్థినిల బతుకమ్మ ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో కల్చరల్ కన్వీనర్ డాక్టర్ రాములు, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ పావని, పిఆర్ఓ విజయకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



# ఏకరూప దుస్తులను సకాలంలో అందించాలి
## సంబంధిత అధికారులకు కలెక్టర్ రాజర్షి షా ఆదేశం




**ఆదిలాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
పాఠశాల విద్యార్థులకు ఏకరూప దస్తుల తయారీపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధశారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి కుట్టు కేంద్రాల ద్వారా ఆయా పాఠశాల లకు సంబంధించిన ఏకరూప దుస్తుల స్టిచింగ్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏక రూప దుస్తులు ఒక జత ఈ నెల 14 వ తేది లోగా అందజేయుటకు చర్యలు తీసుకోవాలని, ఆయా శాఖలకు చేరుకున్న క్లాత్‌ను విద్యార్థుల వారీగా కొలతలు తీసుకుని, మహిళా శక్తి కుట్టు కేంద్రాలకు దుస్తులు కుట్టుటకు అప్పగించాలని మేప్మాను ఆదేశించారు. బేల, జైనథ్, నర్సాపూర్, భట్టి సావర్ గాం, స్కూల్స్ కి సంబంధించి ఒక జత అక్టోబర్ 14 లోపు ఏకరూప దుస్తులు అందించాలని మిగితా 2, 3 జతల ఏకరూప దుస్తులు అక్టోబర్ 25లోగా అందించాలని తెలిపారు. గడువులోగా పూర్తి కావాలని నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందించాలని తెలిపారు.

## రేషన్ బియ్యం స్వాధీనం

**ఆదిలాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
అక్రమంగా తరలిస్తున్న 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా గాంధీచౌక్ వద్ద పట్టుకున్నట్లు సీఐ సునీల్ తెలిపారు. అదేవిధంగా ఆటోలో మహారాష్ట్రకు తరలిస్తున్న 5 క్వింటాళ్ల బియ్యాన్ని స్థానిక పంజాబ్ కూడలి వద్ద పట్టుకున్నా మన్నారు. డీఎస్ఓ వాజిద్ అలీ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.



# స్టీల్ బ్యాంకులను ప్రారంభించిన ఎంపీఓ

**లోకేశ్వరం, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంతో పాటు మన్మధ్ నగర్, గడ్చంధా గ్రామలలో బుధవారం స్టీల్ బ్యాంకును ఎంపీఓ సోలమాన్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించేందుకు ఈ స్టీల్ బ్యాంకులను గ్రామంలోని దాతల సహాయంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టీలు బ్యాంకుకు ఏర్పాటుకు సహకరించిన దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ స్టీల్ బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచయతి కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# మరిన్ని విజయాలను సాధించాలి

## మొదటి ర్యాంకు సాధించిన కానిస్టేబుల్ చెల్లె షేరీన్ పర్వీన్‌ను అభినందించిన ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం




**ఆదిలాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు ఎదిగినప్పుడు జిల్లా పోలీసుల కీర్తి ఉన్నత స్థానాలకు చేరుతుందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విడుదల అయిన డీఎస్సీ మరియు స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఫలితాలలో ఆదిలాబాద్ జిల్లా కు చెందిన కానిస్టేబుల్ షేక్ ఇంజమాముల్ హక్ చెల్లెలు షేక్ షరీన్ పర్వీన్ రాష్ట్రంలోనే స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలోని ఉర్దూ మీడియం నందు 80.03 మార్కులతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది, అదేవిధంగా రాష్ట్రంలోని డీఎస్సీ ఎస్జిటి నందు 79.00 మార్కులతో రెండవ స్థానాన్ని సాధించింది, జిల్లా నందు స్కూల్ అసిస్టెంట్ మరియు డీఎస్సీ ల నందు మొదటి స్థానాలను సాధించింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యుల సమక్షంలో విద్యార్థిని శాలువా, బహుమతిని ప్రధానం చేసి అభినందించి మరిన్ని ఉన్నత లక్ష్యాలను సాధించి కుటుంబ సభ్యుల పేరును జిల్లా పోలీసుల కీర్తిని ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లాలని సూచించారు. అన్నయ్య ఒకవైపు ఉద్యోగం చేస్తూ కుటుంబ బాధ్యతలను మోస్తూ చెల్లెలు చదువుకు కావలసిన వాటిని అందిస్తూ తనను ప్రోత్సహించడం జరిగిందని విద్యార్థిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిసి దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ జైస్వాల్ కవిత, కుటుంబ సభ్యులు తండ్రి మెహబూబ్, అన్నయ్య షేక్ ఇంజమాముల్ హక్, తమ్ముడు ఇమ్రాన్ నజీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం.. పర్యావరణ పరిరక్షణ కృషి చేద్దాం

## మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు కృషి చేద్దాం - ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**కడెం, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని,ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో మానేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. బుధవారం కడం మండలంలోని పెద్దూర్ గ్రామంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు.అంతకు ముందు గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా స్టీల్ బ్యాంకు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో మానేయాలని సూచించారు.భూ కాలుష్యం,నీటి కాలుష్యం జరగడానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ అని భూమిలో ప్లాస్టిక్ నాశనం కావడానికి కొన్నేళ్లు పడుతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా బట్టతో తయారు చేసిన సంచులను వాడాలన్నారు.పాతకాలపు పద్ధతులను అవలంబించాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అమలు చేసి స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ అన్నారు. అహింసయుత మార్గంలో గాంధీజీ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అప్పుల పాలైందన్నారు. కొందరు బిజెపి, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.






# గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీ కోసం దరఖాస్తు

**బెజ్జూర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం తలాయి గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డుల తనిఖీ, పరిశీలన కోసం బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శి పోషాలకు సమాచార హక్కు చట్టం సెక్షన్ 2(1)ప్రకారం దరఖాస్తు పిఐఓ పౌర సమాచార అధికారి పంచాయతీ కార్యదర్శి పోషాలుని కోరడం జరిగిందని గ్రామపంచాయతీ యువకులు తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా తాము కోరిన సమాచారాన్ని సకాలంలో రికార్డులు తనిఖీ చేసేందుకు అవకాశం కల్పించాలని గ్రావ ంపంచాయతీ యువకులు కోరారు.



# పూల పండుగ ప్రారంభం



**బెజ్జూర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండల కేంద్రం తో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం పూల పండుగ ప్రారంభమైంది. మహిళలు గౌరమ్మను ఆరాధ్య దైవంగా భావించి జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ. ఈ పండుగ ప్రారంభం సందర్భంగా ఇంట్లోని మహిళలందరూ పూలు సేకరించి బతుకమ్మ ను అలంకరించి వాడలో అందరూ మహిళలు ఒకచోట చేరి పూల పండుగను ఆనందంగా సంతోషంగా జరుపుకుంటారు. అదేవిధంగా బుధవారం పూల పండుగ ప్రారంభం రావడంతో గ్రామాల్లోని వాడవాడల్లో బతుకమ్మ సంబరాలు జరుపుకోవడంతో ఆటపాటలు ఆనంద ఉత్సవాలు కనిపించాయి. ఈ బతుకమ్మ పండుగకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో ప్రాంతాల్లో విద్యనభ్యసించే కళాశాలల, పాఠశాలల విద్యార్థినీలు, అత్తగారి ఇంటి నుండి ఆడపడుచులు అమ్మ వాళ్ళింట్లోకి చేరుకొని మొదటి రోజు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో పాటతో పూల పండుగను ప్రారంభించడంతో ప్రధాన వీధులు మారుమోగాయి. ఎల్లవేళలా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు.

## భైంసాలో మరోసారి

# రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు

**భైంసా, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
భైంసా పట్టణంలో మరోసారి చైన్ స్నాచర్స్ రెచ్చిపోయారు. నెంబర్ ప్లేట్ లేని బండి పై వచ్చి ఇద్దరు దుండగులు రాహుల్ నగర్ లో గంగాదేవి అనే వృద్ధ మహిళ నుంచి 5 తులాల బంగారు గొలుసు అపహరణ చేశారు. వరుస ఘటనలతో ఒంటరిగా బయటకు వెళ్లాలంటే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత రెండు నెలల్లో 6 చైన్ స్నాచింగ్‌లు కాగా, ఇదే నెలలో కేవలం 15 రోజుల వ్యవధిలోనే రెండు ఘటనలు చోటు చేసుకున్నాయి. బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు దుండగులను వెతికే పనిలో పడ్డారు. సీసీ కెమెరాలో చిక్కిన దుండగులకు సంబంధించి ఒక చిత్రాన్ని సామాజిక మాధ్యమాలలో ఉంచి, ఇట్టి వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



## కుదిరిన ఒప్పందం..

# లేడీస్ టైలర్స్‌కు పెరిగిన ధరలు

**బెల్లంపల్లి, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**



బెల్లంపల్లి పట్టణంలో లేడీస్ టైలర్ల కుట్టు ధరలు పెంచుతూ ఇటీవల లేడీస్ టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు యాదవ్ అధ్యక్షతన స్థానిక కృష్ణమందీర్ యాజమానులు, వర్కర్ లతో జరిగిన సమావేశంలో కొత్త ధరలపై ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం మగ్గం వర్క్, కుచుల పైపింగ్ రూ.120, లైనింగ్ జాకెట్ రూ.110, బోట్ నెట్ జాకెట్ రూ.110, బోటే నేక్ పైపింగ్ రూ.110, బోటే నేక్ డిజైన్ రూ.150, సాదా జాకెట్ రూ 65, లైనింగ్ టాప్ రూ.110, సాదా టాప్ రూ.85, సాదా పైజామా రూ.50, లైనింగ్ పైజామా రూ 60, లంగా జాకెట్ రూ 160, బబుల్స్ జాకెట్ రూ.170, లంగా రూ.80,డిజైన్ జాకెట్ రూ.160 లుగా నిర్ణయించి ఒప్పందం చేసుకోవడం జరిగిందని ఈ ఒప్పందం ప్రకారం ఈ సంవత్సరం అక్టోబర్ 1 నుంచి రెండేళ్లు (అక్టోబర్ 2025 వరకు) అమలులో ఉంటుందని అధ్యక్షుడు గెల్లి రాజ లింగు యాదవ్ తెలిపారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
PRABHATHA SAMACHARAM
TELANGANA TELUGU DAILY
06 | గురువారం । 3 అక్టోబర్ । 2024
https: epaper.prabhathasamacharam.com

# భక్తులకు అసౌకర్యం కలిగిస్తే సహించేది లేదు

**- బాసర లో దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి - అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**





ఆలయ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**బాసర, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో శరన్నవ రాత్రి ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం సరస్వతి అమ్మవారి క్షేత్రంలో రాజన్న అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం అయితే ఊరుకునేది లేదని ఆలయ అధికారులను హెచ్చరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, ఇతరత్ర సౌకర్యాలు కల్పించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి, భక్తులు రానున్న సందర్భంగా సరస్వతి అమ్మవారి దర్శనం కోసం వేచి చూసే భక్తులకు ఇలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదు అన్నారు. క్యూలైన్లలో పాల పంపిణీ, అల్పాహారం పంపిణీ చేయాలని సూచించారు. పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అవసరమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు తెలియజేశారు. భక్తుల వాహనాలకు ఇబ్బందులు కలగకుండా విశాలమైన ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు విశ్రాంతి కోసం సత్రాల ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద భక్తుల పుణ్యస్నానం ఆచరించే సమయంలో గతంలో కంటే ఈసారి పెద్ద ఎత్తున భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను నియమించాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా, వైద్య సిబ్బంది వైద్య శిబి రాలు ఏర్పాటు చేయాల్సిందిగా చెప్పారు. దసరా ఉత్సవాల సందర్భంగా పంచాయతీరాజ్ రెవెన్యూ దేవాదాయ, పోలీస్ అన్ని శాఖల అధికారులతో మూడు గంటలకుపైగా భక్తుల కలిగించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఆలయ అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాల్సిన బాధ్యత ఉందన్నారు. తప్పులు జరిగితే సహించేది లేదని తేల్చి చెప్పారు. సమావేశంలో ఆల య ఇఓ తోపాటు ఆయా శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# ముధోల్‌ను మున్సిపాలిటీగా ప్రకటించాలి



**ముధోల్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
ముధోల్ నియోజకవర్గం అయినా ముధోల్‌ను మున్సిపాలిటీగా ప్రకటించాలని బుధవారం గ్రామసభలో తీర్మానం చేశారు. నియోజకవర్గమైనప్పటికీ ముధోల్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ప్రకటించకపోవడం గ్రామ ప్రజలకు అన్యాయం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముధోల్లో 10,000 మంది ఓటర్లు ఉండగా 18 వేల మంది జనాభా కలిగి ఉన్నారని గ్రామసభలో పేర్కొన్నారు. ప్రస్తుతం ముధోల్ మున్సిపాలిటీగా మార్చాలని గ్రామసభలో తీర్మానం గావించారు ఈ సందర్భంగా పంచాయతీ ఈవో ప్రసాద్ గౌడ్ మాజీ వార్డు మెంబర్లు అజీజ్, పోతన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

## 30 యాక్ట్ అమలు పాటించాలి

**భైంసా, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
సోషల్ మీడియా, ఇతర సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎటువంటి అసత్య ప్రచారాలు నమ్మొద్దని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం భైంసా పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ... కుభీర్ మండలానికి చెందిన ఒక అమ్మాయి, అబ్బాయికి సంబంధించిన చిన్న ఘటన బుధవారం చోటు చేసుకోగా, ఈ గొడవను దీర్ఘ దృష్టితో చూడొద్దన్నారు. ఇప్పటికే ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారన్నారు. జిల్లాలోని ప్రజలు 30 యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరూ ఉల్లంఘించే పనులు చేయొద్దని సూచించారు. ఆమె వెంట పట్టణ టౌన్ ఎస్.హెచ్.ఓ జి.గోపీనాథ్, పోలీసులున్నారు.



# కొలవర్ రాష్ట్ర కార్యవర్గం అత్యవసర సమావేశం



**బెజ్జూర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండలంలోని ఆదివాసీ భవన్‌లో బుధవారం కొలవార్ సేవా సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్ష, జనరల్ సెక్రెటరీ పారేపల్లి పోశం, నేర్మల్లి సదాశివ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఆదివాసులకు చెందాల్సిన హక్కులు రావడంలేదని కొలవార్లను పీవిటిజి లో చేరిపించాలని ఐటీడీఏ ద్వారా వందశాతం రాయితీపై రుణాలు ఇవ్వాలని ప్రతి మండల కేంద్రంలో 50 లక్షలతో కోలావార్ సంక్షేమ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ తీర్మానించినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల ఆరవ తేదీ ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రాష్ట్ర కార్యవర్గా బాధ్యతలు అప్పగింత ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కోలావర్ నాయకులు తరలి రావాలని పిలుపినిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పారేపల్లి పోషం, జనరల్ సెక్రెటరీ నేర్పల్లి సదాశివ్, గౌరవ అధ్యక్షులు నేర్పల్లి బ్రహ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి తుమ్మిడి అశోక్, ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి మానేపల్లి లక్ష్మణ్, జిల్లా నాయకులు బిబ్బేర భూమయ్య, కౌటాల మండల అధ్యక్షులు ఎడ్ల భీమయ్య, బెజ్జూర్ మండల అధ్యక్షులు పెద్దల శంకర్, చింతలమానేపల్లి, మండల నాయకులు పారేపల్లి నరసింహులు, బుర్రి నీలయ్య, యూత్ మండల అధ్యక్షులు ఎడ్ల మహేష్, యూత్ అధ్యక్షులు మేడి సతీష్, గ్రామ పెద్దలు ఆత్రం బక్కయ్య, పెద్దల సంతోష్, చింతపుడి ప్రకాష్, మేకల గొంతు, బండి రాజారాం గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ పండుగ

**ముధోల్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
ముధోల్ మండలంలోని ఆస్థ గ్రామంలో భాష్యం పాఠశాలలో సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకున్నారు .తంగేడు ఆకులతో బతుకమ్మను తయారుచేసి విద్యార్థినులు ఉపాధ్యాయురాలు బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాల ద్వారా సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న చెరువులో బతుకమ్మలను వదిలారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాధవ రావు పటేల్ తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## స్వగ్రామానికి చేరుకున్న గల్ఫ్ బాధితుడు

**ముధోల్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఏజెంట్ చేతిలో మోసపోయిన ముధోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన బాధితుడు రాథోడ్ నాందేవ్ కువైట్ నుంచి స్వగ్రామానికి చేరుకున్నాడు. హౌస్ కీపింగ్ ఉద్యోగం పేరుతో తీసుకెళ్లి ఎడారిలో ఏజెంట్ వదిలేసిండు ఉంటూ ఎల్ఫీ ఉడియో ద్వారా తనను రక్షించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నాడు. ప్రభుత్వ చోరువతో ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేసి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.




## గోదావరిలో మృతదేహం లభ్యం

**బాసర, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
గోదావరి నదిలో ఒకరి మృత దేహం లభ్యమైనట్లు బుధవారం ఎస్ఐ గణేష్ తెలిపారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు జిల్లా లింగసముద్రం గ్రామానికి చెందిన వంగదారి అద్రత్ (37)గా గుర్తించారు. నెల్లూరు నుండి బాసరకు మేస్త్రి పనికి వచ్చిన అడ్రత్ మంగళవారం సాయంత్రం గోదావరి నదిలో స్నానానికానీ వెళ్లి ప్రమాదవశాత్తు నదిలో మునిగిపోయాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



## పాఠశాలను పరిశీలించిన సబ్ కలెక్టర్లు

**కాగజ్‌నగర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ పట్టణంలోని సంఘం బస్తీలో ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఇటీవల తరగతి గది గోడ కూలింది. మంగళవారం అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలను తాత్కాలికంగా వేరే భవనానికి మారుస్తామన్నారు.



# బాసరకు.. నవకళ





సరస్వతీ అమ్మవారి మూల విగ్రహం



ఆలయాన్ని పూలతో ముస్తాబు చేసిన దృశ్యం

**దక్షిణ భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా గోదావరి నది తీరాన కొలువైన చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి క్షేత్రంలో శ్రీ మహాలక్ష్మి శ్రీ మహాకాళి శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారు ముగ్గురు కొలువై ఉండడంతో విశేష స్థానం కలదు. నవరాత్రులలో తొమ్మిది రోజుల పాటు ముగ్గురు అమ్మవార్లను కొలిచేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి భక్తులు వేలాదిగా తరలివస్తారు. అమ్మవారి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. నవరాత్రి ఉత్సవాలలో అమ్మవార్లకు దేవాదాయ శాఖ తరపున పట్టు వస్త్రాలను సమర్పించడం జరుగుతుంది.**

### నవరాత్రులు నవ రూపాలు ప్రత్యేక పూజలు

దేవి నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు తొమ్మిది రూపాలలో భక్తులకు దర్శనమిస్తారు. ఒక్కో రోజు ఒక్కో రూపంతో భక్తులకు అమ్మవారు దర్శనం ఇవ్వడం సాంప్రదాయం. మొదటి రోజు శైలపుత్రి, రెండవ రోజు బ్రహ్మచారిని, మూడవ రోజు చంద్రగంట, నాల్గవ రోజు కుష్మాండ అవతారం, ఐదవ రోజు స్కంద మాత, ఆరవ రోజు కాత్యాయని అవతారం, ఏడవ రోజు కాలరాత్రి అలంకారం, ఎనిమిదవ రోజు మహా గౌరీ ,9వ రోజు సిద్ధ ధాత్రి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఈ తొమ్మిది రోజులు అమ్మవార్లకు ఒక్కో రోజు ఒక్కో నైవేద్యం ఆలయ అర్చకులు వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి సమర్పిస్తారు.

### విశేషంగా అమ్మవార్లకు పూజలు

దేవి శరన్నవరాత్రి ఉత్సవములలో భాగంగా తేదీ.03.10.2024 నుండి 12.10.2024 వరకు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం చతుఃషష్ఠి (64) ఉపచారలతో మాహా పూజలు, విశేష లలితా సహస్ర నామ కుంకుమార్చన మాహావిద్యా పారాయణ చండి పారాయణ విశేష నైవేద్యములు వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది. ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుండి తొమ్మిది రోజులు ఆలయంలోని శ్రీ మహాకళీ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు.

### అక్షరాబ్యాస పూజలకు నిలయం బాసర క్షేత్రం

దేశంలోని రెండు సరస్వతి ఆలయాలలో ఒకటి కాశ్మీర్ రాష్ట్రంలో ఉండగా మరొకటి తెలంగాణ రాష్ట్రం బాసరలో కలదు. ఈ క్షేత్రంలో అమ్మవారి చెంత చిన్నారులకు అక్షర స్వీకార పూజలకు నిలయం దేశంలోని పలు రాష్ట్రాల నుండి భక్తులు తమ చిన్నారులకు అక్షర స్వీకార పూజలు జరిపించడానికి ప్రతిరోజు వేల సంఖ్యలో తరలివస్తారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం రోజున అమ్మవారి చెంత అక్షర శ్రీకర పూజలు జరిపిస్తే చిన్నారులు ఉన్నత విద్యావంతులు అవుతారని భక్తుల నమ్మకం దీనిని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు పోలీసులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకకి క్యూ లైన్ లను ఏర్పాటు చేస్తారు.

### బాసర క్షేత్రనికి రైలు, బస్సు సౌకర్యం..

హైదరాబాద్ నుండి రోడ్డు మార్గం గుండా నిజామాబాద్ వరకు 172 కిలోమీటర్లు నిజామాబాద్ నుండి బాసర పుణ్యక్షేత్రం 35 కిలోమీటర్లు ఉంటుంది. సికింద్రాబాద్ నుండి రైలు మార్గం బాసర వరకు కలదు. సికింద్రాబాద్ నుండి ఆన్లైన్లో టిఎస్ ఆర్టీసీ ద్వారా బాసర వరకు టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

- మహిమాన్విత క్షేత్రం.. బాసర
- నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు
- నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సరస్వతీ క్షేత్రం
- వేడుకలకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు





బాసరలోని సరస్వతీ వఆలయం

## భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం : ఈఓ విజయరామరవు

శారదీయ నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఓ విజయ రామారావు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి దర్శనానికి అక్షర శ్రీకర పూజలకు వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్నదానం , వసతి ఏర్పాట్లు, ప్రత్యేక అక్షరాభ్యాసం మండపాలు, అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్, అక్షరభ్యస పూజలకు ప్రత్యేక క్యూ లైన్, అమ్మవారి ఆలయంతో పాటు ఉప అలయాలను రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించడం జరిగిందని తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా భారీగా పోలీసుల బందోబస్తు సైతం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.










ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
PRABHATHA SAMACHARAM
TELANGANA TELUGU DAILY

# గాంధీజీ ఆశయాలు సాధిద్దాం








**ఉట్నూర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
అహింసాయుత మార్గాన్ని అనుసరించి దేశానికి స్వాత్రాంత్ర్యన్ని తెచ్చి పెట్టిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా అన్నారు.బుధవారం ఐ టి డి ఎ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు .ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపై తెచ్చి ఆంగ్లేయుల పాలనను అంతమొందించడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని,ఆయన చేసిన పోరాటాల వల్లె దేశానికి స్వాతంత్రం వచ్చిందని తెలిపారు.హింసకుతావు లేకుండా మహాత్మా గాంధీ చేసిన పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.నేటి యువత ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకొని,ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో (ఏపీఓ) వసంతరావు, (ఏడియంఅండ్హెచ్) ఓ కుడిమేత మనోహర్, (ఏఒ) దామోదర్, (పిఎచ్ఒ)సందీప్ కుమార్,జె డి ఎమ్ నాగభూషణం (పేసా కోఆర్డినేటర్ )వసంతరావు , డిపిఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి - ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా గాంధీ జయంతి నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల సభ్యులు

**జన్నారం :** ప్రతి ఒక్కరూ శాంతియుత మార్గంలో గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని ఫోన్ కాల్ తాజా మాజీ సర్పంచ్ ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు జక్కు భూమేష్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గాంధీనగర్‌లోని విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వార్త క సంగం ప్రసిడెంట్ వామన్ వైశ్య సంగం కార్య దర్శి గోపాల్, వార్తక సంగం జక్కు రమేష్, కోశాధికారి శివరామకృష్ణ, వైశ్య సంగం, వార్తక సంగం సభ్యులు పాల్గొన్నారు.
**లోకేశ్వరం :** మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం జాతి పిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వర్తించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ క్రమంలో పలువురు మాట్లాడుతూ.. దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని గాంధీజీ అన్నట్లు గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ బాపూజీ అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు, ఆశా కార్యకర్తలు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.
**కాగజ్‌నగర్ :** గాంధీ జయంతి సందర్భంగా కాగజ్ నగర్ పట్టణంలో ఆ మహనీయుని గుర్తు చేసుకుంటూ అయన చిత్రపటానికి పూలమాలవేసి సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రావి శ్రీనివాస్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, సీనియర్ నాయకులు ప్రసాద్ పట్టణ నాయకులు ఏమ్మాజీ సంతోష్ , ఎండి అధర్, మహేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కార్యకర్తలు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కాగజ్ నగర్ పట్టణంలో మహాత్మా గాంధీ జయంతి జరుపుకొన్నారు.స్థానిక గాంధీ చౌక్ లొ తెలుగుదేశం పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు మాజీ అధ్యక్షులు సిర్పూర్ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గుల్లపల్లి ఆనంద్ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి , సన్మార్గంలో ఆయన చూపిన బాటలో బాపూజిని ఆదర్శంగా తీసుకొని అందరూ నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్లూరి శంకర్, ఎలమంచిలి శ్రీనివాస్, వాసు, మక్బూల్, గులాబ్ రావు, సురేందర్, ఎడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.
**ముథోల్ :** మండల కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని చైతన్య యూత్ ఆధ్వర్యంలో మాత్మ గాంధీ విగ్రహానికి బిజెపి నాయకుడు టి రమేష్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు అలాగే ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలను కాంగ్రెస్ నాయకులు రావుల శ్రీనివాస్ సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఎడ్ బీడ్ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి ఆధ్వర్యంలో మాత్మ గాంధీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహాత్ముడు చూపిన మార్గంలో పయనిద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురుగుల పోశట్టి, మాజీ సర్పంచ్ అశోక్, వీడిసి నాయకులు మెరుగు లస్మారెడ్డి, పూప్పల గంగాధర్, మెట్టు గంగాధర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముడి అడుజాడల్లో నడవాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి గాంధీజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత జాతిపిత మహాత్మా గాంధీ చూపిన శాంతి సామరస్యం ద్వారా ప్రతీ సమస్యను పరిష్కరించుకోవచ్చని, ముఖ్యంగా ఏడు సూత్రాలను అందరు పాటించాలన్నారు. గాంధీజీ అహింస మార్గం తోనే స్వాతంత్రం సిద్దించిందని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చెరువవ్వాలని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని సత్యం, అహింస మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. పట్టణంలో, గ్రామాలలో స్వచ్ఛత పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. గాంధీజీ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, వినోద్ కుమార్, జిల్లా పౌర సంబంధాల అధికారిణి తిరుమల, రామిరెడ్డి, తహసీల్దార్లు, సూపరెండెంట్ తదితరులు పాల్గొన్నారు.



శాంతి, అహింస మార్గాల ద్వారానే

## విజయాలను సాధించవచ్చు

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
జాతిపిత మహాత్మా గాంధీ చూపినటువంటి అహింస శాంతియుత మార్గాల ద్వారానే విజయాలను సాధించవచ్చని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్పీ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో మహాత్మా గాంధీ అగ్రగణ్యుడు. ప్రజలు అతన్ని మహాత్ముడని, జాతిపిత అని గౌరవిస్తారు. సత్యము, అహింసలు గాంధీ నమ్మే సిద్ధాంత మూలాలు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహము అతని ఆయుధాలు. తెలంగాణ రాష్ట్రం సాధించడం జరిగిందని, ఏ ప్రాంతంలో అయితే శాంతి, అహింస ప్రభరిల్లుతాయో అక్కడే అభివృద్ధి సాధ్యపడుతుందని కాబట్టి ప్రతి ఒక్కరూ గాంధీ చూపినటువంటి శాంతి, అహింసా మార్గాలను అనుసరిస్తూ జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని తెలియజేశారు. ప్రతి ఒక్క పోలీస్ అధికారి నీతి నిజాయితీతో విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు మంచి సేవ చేయాలని అటువంటి వారికి కచ్చితంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు సతీష్, పెద్దయ్య, అంజన్న, మార్కండేయ, హరినాథ్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు ఎం విజయ శంకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే

## గాంధీజీకి మనమిచ్చే నిజమైన నివాళి

**ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**



**కాగజ్‌నగర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని గాంధీ పార్క్‌లో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్ శ్రీ రాచకొండ గిరీష్ గాంధీజీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే హరీష్ బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీకి నిజమైన నివాళి మనం అర్పించాలనుకుంటే మన చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు విశ్వవిద్యాల యానికి పొట్టి శ్రీరాములు పేరు తీసేసి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టడం సరైనది కాదని,తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరే కొనసాగించాలని, కొత్తగా ఏర్పడే స్కిల్ యూనివర్సిటీ తదితర యూనివర్సిటీలలో ఒక యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టవచ్చని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డా.కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్ర, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఈర్ల విశ్వేశ్వర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ తిరుపతి, అశోక్ ఆర్య, ధోతుల శ్రీనివాస్, బూరం రాజు, అశోక్, రమేష్, సంతోష్ ఠాకూర్, రాణి, అర్జున్, అనిల్, సౌరబ్ ధాత్రక్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు పరివర్తన చెంది

## మంచి వైపు అడుగులు వేయాలి



**ఆదిలాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక జిల్లా జైలులో ఏర్పాటు చేసిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ బి.సౌజన్య, అదనపు ఎస్పీ సురేందర్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జైళ్లలోని ఖైదీలు పరివర్తన చెంది మంచి వైపు అడుగులు వేయాలని, మనిషి పుట్టుకతో ఎలాంటి నేరాలు చేయరని ఆవేశాన్ని తగ్గించుకుని జీవించినప్పుడే సమాజంలో గౌరవంగా జీవించగలమన్నారు. ఇక్కడ అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, మంచి ఆహ్లాదకరమైన వాతావరణం, మెనూ ప్రకారం ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ బుధవారం కౌన్సిలింగ్ జరుగుతుందని, సైకాలజిస్ట్‌లను నియమించడం జరిగిందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ గాంధీజీని స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణతో మెలగాలని, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడలు ఆటలలో ఇండోర్ (క్యారమ్స్, చదరంగం, స్నేక్ ల్యాడర్, లూడో, తదితర ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి, కృష్ణ, జిల్లా సుపరెండెంట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

https: epaper.prabhathasamacharam.com

ప్రభాత సమాచారం

జిల్లా అనుబంధం
PRABHATHA SAMACHARAM
TELANGANA TELUGU DAILY

# MOVIE TIME ప్రభాత సమాచారం

## ఓటీటీలోకి 35 చిన్న కథ కాదు



ప్రియదర్శి, నివేదా థామస్, విశ్వదేవ్ ఆర్, ప్రధాన పాత్రల్లో వచ్చిన తాజా చిత్రం '35 చిన్న కథ కాదు'. ఈ సినిమాకు నందకిశోర్ ఇమాని దర్శకత్వం వహించగా.. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక 'ఆహా'లో నేటి నుంచి ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఆహాలో ఎక్స్ వేదికగా ప్రకటించింది.




## యుఫోరియా

టాలీవుడ్ లో భారీ సినిమాలు తీసే ఫేమస్ దర్శకుల్లో ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ ఒకరు. కమర్షియల్ అయినా పౌరాణిక, పీరియాడిక్ సినిమాలు అయినా చేయగలిగే గుణశేఖర్ నుంచి ప్రస్తుతం రాబోతున్న మరో ఇంట్రెస్టింగ్ సినిమానే "యుఫోరియా". అయితే అనౌన్సమెంట్ తోనే ఈసారి ఏదో క్రేజీ ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపించింది. ఇక ఈ సినిమా నుంచి ఇప్పుడు మేకర్స్ మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ని వదిలారు. ఈ సినిమా నుంచి మరిన్ని డీటెయిల్స్ గా ఒక సరికొత్త గ్లింప్స్ ని అయితే ఈ అక్టోబర్ 7న వదలనున్నట్టుగా తెలిపారు. మరి ఈ గ్లింప్స్ చూడాలి. ప్రస్తుతానికి నటీనటులపై ఎలాంటి వివరాలు మేకర్స్ రివీల్ చేయలేదు. పూర్తిగా కొత్త నటీనటులతో సినిమా తెరకెక్కుతున్నట్టు తెలుస్తుంది. మరి గుణశేఖర్ ఈసారి ఎలాంటి ప్లాన్ తో వస్తున్నారో చూడాలి.

## నానితో శ్రీనిధి శెట్టి..

నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన విషయం తెలిసిందే. వీటిలో ఒకటి హిట్-3. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే నాని పాత్రకు సంబంధించిన స్నీక్ పీక్ గ్లింప్స్ షేర్ చేయగా.. మంచు పర్వతాల మధ్య కారుతో దూసుకుపోతున్న హిట్ ఆఫీసర్‌ని ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు ఛేజ్ చేస్తున్న సన్నివేశాలతో సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. కాగా ఈ చిత్రంలో ఫీమేల్ లీడ్ రోల్‌లో ఎవరు కనిపించబోతున్నారనేది ఓ వార్త తెరపైకి వచ్చింది. తాజా టాక్ ప్రకారం కేజీఎఫ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఫైనల్ అయినట్టు ఇన్‌సైడ్ టాక్. దీనిపై అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని తెలుస్తోంది. ఈ మూవీని 2025 మే 1న గ్రాండ్‌గా విడుదల కానుంది.



## విజయ్ 69లో పూజా హెగ్డే..

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ హీరోగా నటించిన రీసెంట్ చిత్రం "ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం" . మరి దర్శకుడు వెంకట్ ప్రభు ఈ చిత్రాన్ని విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా చేశారు. అయితే ఈ చిత్రం తర్వాత విజయ్ తన కెరీర్ 69వ సినిమా చేసి ఇక సినిమాలు ఆపేస్తున్నట్టుగా తెలిపాడు. దీనితో తన 69వ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా ఇప్పుడు మేకర్స్ ఈ సినిమాపై ఒకో అప్డేట్‌ని అందిస్తూ వస్తున్నారు. అలా రీసెంట్ గానే బాలీవుడ్ ప్రముఖ నటుడు బాబీ డియోల్ ఈ సినిమాలో ఉన్నట్టుగా మేకర్స్ అఫీషియల్ గా ప్రకటించారు. గత కొన్ని రోజులు నుంచి ఈ సినిమాలో స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే కూడా ఉందని పలు రూమర్స్ బయటకి వచ్చాయి. మరి వీటిని నిజం చేస్తూ మేకర్స్ అధికారిక అనౌన్సమెంట్ ఇచ్చేశారు. దీనితో విజయ్ తో పూజా రెండోసారి జత కట్టనుండటం ఖరారైంది. ఇక ఈ చిత్రాన్ని కోలీవుడ్ టాలెంటెడ్ దర్శకుడు హెచ్ వినోద్ దర్శకత్వం వహిస్తుండగా అనిరుద్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే కన్నడ నిర్మాణ సంస్థ కే వి ఎన్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
PRABHATHA SAMACHARAM
TELANGANA TELUGU DAILY

### ఏకలవ్య మోడల్ పాఠశాలను

# వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

### ఏకలవ్య మోడల్ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన - ఎంపీ గోడం నగేశ్





**ఉట్నూర్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
గిరిజన విద్యార్థులకు సీబీఎస్ ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకే ఏకలవ్య మోడల్ పాఠశాలలను నెలకొల్పి విద్యబోధన జరుగుతుందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. పీఎం ధర్తీ ఆబా జన్జాతీమా గ్రామ్ అభియాన్ కార్యక్రమం ప్రారంభోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉట్నూర్, ఇంద్రవెల్లిలో ఉన్న ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. పీఎం జన జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ కార్యక్రమం ప్రారంభాన్ని పీఎం నరేంద్ర మోడి చేతుల మీదుగా జార్కండ్ రాష్ట్రంలో వర్చువల్ ద్వారా ఉట్నూర్, ఇంద్రవెల్లిలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో ప్రారంభించారు. ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా మోడి ప్రసంగాన్ని విన్నారు. దేశంలోని 26రాష్ట్రాలలోని 140 ఏరియాలలో ఈ కార్యక్రమాన్ని వర్చువల్ గా ప్రారంభిస్తున్నట్లు మోడి సందేశానిచ్చారు. ఈ పథకం ద్వారా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 83, 700 కోట్లు నిధులను ఖర్చు చేస్తుందని ఎంపీ నగేశ్ పేర్కొన్నారు. గిరిజనులకు మెరుగైన విద్యను అందించేందుకు ఏకలవ్య పాఠశాలలను 35కోట్లతో నిర్మించడం జరిగింద న్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పాఠశాలలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సీబీఎస్ సెలబ స్ ద్వారా విద్యను అందిస్తున్నారని, గిరిజన విద్యార్థులు చదవు రాణించేందుకు కృషి, పట్టుదల ఉండాలన్నారు. ఎదైన సాధించాలని తపన ఉండాలన్నారు. కార్యక్రమాల్లో ఐటీడీఏ ఏపీఓ జనరల్ వసంత్ రావ్, ఆర్సీఓ అరవింద్, తదితరులున్నారు.

## రేపటి నుంచి చెరువుల్లో

# చేప పిల్లల పంపిణీ

### రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

**ఆదిలాబాద్, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
తెలంగాణలోని అన్ని జిల్లాల్లో గురువారం నుండి చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చెరువుల్లో చేపపిల్లలను వేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో వెలుగులు నింపడమే తమ లక్ష్యమన్నారు. చేప పిల్లల పంపిణీ వల్ల భవిష్యత్ లో మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు కురవాలని ఆకాంక్షించారు. అన్ని జిల్లాల్లో తెలంగాణ మత్స్యశాఖ తరుపున చేపల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. మంత్రులు, విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , ఎంపీలు తదితర నేతలు చేపల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ప్రతి చెరువుకు మూడు రకాల చేప పిల్లలు ఇచ్చేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఫిషరీస్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌తో పాటు, డైరెక్టర్ ప్రియాంక అలా తదితర అధికారులకు సూచించారు.

## రేపు జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం

**ఆదిలాబాద్, అక్టోబర్ 2, (ప్రభాత సమాచారం)**
కాటన్ మార్కెటింగ్ సీజన్ 2024-25కు సంబంధించి ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, జిన్నింగ్ మిల్ యజమానులు, మార్కెటింగ్ అధికారులు, రైతులతో రేపు నిర్వహించనున్న సమావేశం స్వల్ప మార్పు చేసినట్లు మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3.00 గంటలకు నిర్వహించనున్న సమావేశాన్ని 2.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## మద్యపానం చేసే వారికి స్థానిక సంస్థల టికెట్లు ఇవ్వం : ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**దండేపల్లి, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
మద్యపానం చేసే వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు, పదవులు ఇవ్వబోమని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గాంధీ జయంతి సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఇకపై మద్యపానం చేయబోమని ప్రతిజ్ఞ చేశారు.ఇక్కడి కాంగ్రెస్ నేతలు మద్యం సేవించమని, మాదకద్రవ్యాలు తీసుకోమని ప్రమాణం చేశారు. గాంధీజీ కన్న కలలు సాకారం చేయడానికి మద్యానికి దూరంగా ఉండాలనే నిర్ణయం తీసుకున్నట్లు వారు చెప్పారు. ఈ ప్రతిజ్ఞను ఉల్లంఘించే వారికి స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు టికెట్లే కాదు.. ఏ పదవులూ ఇవ్వబోమని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తేల్చి చెప్పారు. ప్రతిజ్ఞ చేసిన నేతలంతా తాము కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా జీవనం సాగిస్తామని, వర్గ విభేదాలు, కులమత తేడాలు, కక్షలు, గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తామన్నారు.



విలేకరులు
కావలెను
ప్రజాసమస్యలే అజెండాగా అక్షరాలు సంధించే సామర్థ్యం ఉన్న పాత్రికేయులు కావలెను. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇన్-చార్జీలు, జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గ, డివిజన్ ఇన్-చార్జీలతో పాటు మండల విలేకర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తిగల అభ్యర్థులు సంప్రదించండి.
సయ్యద్ కరీం
ప్రధాన సంపాదకులు
ప్రభాత సమాచారం డిజిటల్ మీడియా
9440977660, 9110718194
ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలి

### ఖానాపూర్‌ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్/ ఇంద్రవెల్లి, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీ గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు.బుధవారం ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ నూతన పాఠశాలలను దేశ ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించగా ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ గోడం నగేష్, ఐటీడీఏ పిఓ ఖుష్బు గుప్తా హాజరయ్యారు.ఈ సందర్బంగా రిబ్బన్ కట్ చేశారు..జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసి గిరిజనులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని,ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ఎన్ని కష్టాలు వచ్చిన చదువును మధ్యలో ఆపకూడదన్నారు. ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు.ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదువు కోవాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్, ఆర్సిఓ, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## రిలయన్స్ ట్రెండ్‌కు తాళం

**మంచిర్యాల, అక్టోబర్ 2 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలోని రిలియన్స్ సంస్థకు చెందిన రిలయన్స్ మార్ట్, రిలయన్స్ ట్రెండ్స్ కు ఈరోజు సాయంత్రం స్థానిక పోలీసులు తాళాలు వేశారు. వివరాల్లోకి వెళ్ళితే గత నెల 15 న పట్టణ హైవే సమీపంలోని శెనిగాకుంట మత్తడి బాంబు పేలుళ్లలో సంబంధం ఉన్న బిఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా గత కొన్నిరోజులుగా పోలీసుల కు చిక్కకుండా పరారీలో ఉదండడంతో పోలీసులు గత కొన్ని రోజులు నుంచి రాంలాల్ కోసం బంధువుల, మిత్రుల ఇండ్ల లో వెతికి నప్పట్టికి ఫలితం లేక పోవడం తో పోలీసులు పరారీలో ఉన్న రాంలాల్ కు చెందిన రైస్ మిల్, అటుకుల మిల్ తో పాటు తాను అద్దెకు ఇచ్చిన రిలయన్స్ షాపింగ్ మాల్ కు కూడా తాళం వేశారు.